క్లుప్తంగా

మద్ది అంజన్న క్షేత్రానికి భక్తుల తాకిడి



మద్ది క్షేత్రంలో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని గురవాయిగూడెం శ్రీ మద్ది ఆంజనేయస్వామి వారి క్షేత్రానికి మంగళవారం భక్తుల తాకిడి పెరిగింది. ఆలయ అర్చకులు స్వామి వారికి తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 ప్రదక్షిణలు చేసి భక్తులు మొక్కులను తీర్చుకున్నారు. ఆదాయం రూ.91,591 వచ్చినట్లు, 1,000 మంది స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరించినట్లు ఆలయ కార్య నిర్వాహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు. మిధునరావుపాలేనికి చెందిన శ్రీరామభక్త భజన సమాజం సభ్యులు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావులు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా ఏజెన్సీ రహదారులు



ఏజెన్సీ గ్రామాలకు వెళ్లే రోడ్డులో గోతుల్లో నిలిచిన వర్షపు నీరు

పోలవరం రూరల్: ఏజెన్సీ గ్రామాలకు వెళ్లే రోడ్డు మార్గం భారీ వర్షాలతో అధ్వానంగా మారింది. పోవరం నుంచి ఇటికిల కోట, వింజరం మీదుగా రేపల్లెవాడ జంక్షన్ వరకు వెళ్లే ఏజెన్సీవాసులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గోతుల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో తరుచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఏజెన్సీవాసులు వాపోతున్నారు. ఆర్టీసీ బస్సుల రాకపోకలకు సైతం ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



వేగవరంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో విజయ్ ప్రసాద్

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని సచివాలయాల్లో నిర్వహిస్తున్న ఆధార్ నమోదు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కె.విజయ్ ప్రసాద్ అన్నారు. మండలంలోని వేగవరం పంచాయతీలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని మంగళవారం ఎంపీడీవో కె.విజయ్ ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి 27 వరకు మండలంలోని సచివాలయాల్లో ఆధార్ నమోదు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 24న శ్రీనివాసపురంలో ఆధార్ నమోదు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో విజయ్ ప్రసాద్ తెలిపారు.

ప్రత్యేక ఆధార్ శిబిరానికి స్పందన

కొయ్యలగూడెం: ఆధార్ సేవల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార్ శిబిరానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. మంగళవారం పరింపూడి సచివాలయం వద్ద నిర్వహించిన ప్రత్యేక ఆధార్ శిబిరంలో నూతనంగా చిన్నారులకు ఆధార్ నమోదు చేయడం, పుట్టిన తేదీ మార్పులు చేర్పుల సమస్యలను పరిష్కరించినట్లు అధికారులు పేర్కొన్నారు. బుధవారం బయ్యన్నగూడెం సచివాలయం-1 పరిధిలో ఆధార్ ప్రత్యేక శిబిరం నిర్వహిస్తామన్నారు. కార్యదర్శులు సీహెచ్ భవాని, ఎ.సూర్యచంద్రరావు, యు.గంగాధరరావు, తదితరులు పాల్గొన్నారు.

టీఎల్ఎం ప్రదర్శన

లింగపాలెం: విద్యా విధానంలో సమూలంగా మార్పులు తీసుకొచ్చి జాతీయ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టి నాలుగు సంవత్సరాలైన సందర్భంగా శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఏలూరు జిల్లా సమగ్ర శిక్ష ఇన్‌ఛార్జ్ సీఎంవో జె.రవీంద్ర తెలిపారు. లింగపాలెం మండలం సింగగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నూతన విద్యా విధానం, శిక్షా సప్తహ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం టీఎల్ఎం ప్రదర్శన ఏర్పాటు చేశారు. రవీంద్ర మాట్లాడుతూ ఈనెల 22 నుంచి 28 వతేదీ వరకు అన్ని పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

జిల్లా సమావేశాలను జయప్రదం చేయాలి

కామవరపుకోట: కామవరపుకోటలో ఈ నెల 29, 30 తేదీల్లో నిర్వహించబోయే వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా స్థాయి సమావేశాలను జయప్రదం చేయాలని సంఘ జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ పిలుపు నిచ్చారు. స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లా ఆవరణలో సమావేశ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగం అభివృద్ధిలో రైతులు, వ్యవసాయ కూలీలు జోడెడ్ల పని చేస్తున్నారన్నారు. వ్యవసాయ రంగం నేడు సంక్షోభంలో పడిందన్నారు. వ్యవసాయ సంఘ జిల్లా అధ్యక్షుడు జీవరత్నం, అందుగుల ప్రభాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

నిరంతర పర్యవేక్షణలో పునరావాస కేంద్రాలు

సహాయక చర్యలు వేగవంతం..
ఆర్డీవో కె.అద్దయ్య



కట్కూరులో మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్న దృశ్యం



గొమ్ముగూడెం, లచ్చిగూడెం వరద బాధితులకు ఆహారాన్ని అందిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: వరద ఉధృతికి ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను నిరంతరం పర్యవేక్షిస్తామని ఆర్డీవో కె.అద్దయ్య అన్నారు. గోదావరి వరద ముంపు వలన వేలేరుపాడు మండలంలోని 36 గ్రామాలు వరద ప్రభావిత ప్రాంతాలుగా సహాయక చర్యలు చేపట్టామన్నారు. కోయిదా, కటుకూరు, నార్లవరం, రుద్రంకోట, తాట్కూరుగొమ్ము, రేపాకగొమ్ము పంచాయితీల్లోని వరద ప్రభావిత కుటుంబాలకు 4 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం శివకాశీపురంలో పునరావాస కేంద్రానికి రేపాకగొమ్ము నుంచి 393 కుటుంబాలు, వేలేరుపాడు నుంచి 15 కుటుంబాలు, నెమలిపేట ఆర్అండ్ఆర్ కాలనీలోని పునరావాస కేంద్రానికి తరలించామన్నారు. ప్రస్తుతం 15 వరద ప్రభావిత గ్రామాలకు కూరగాయలు, పాలు, కొవ్వొత్తులు, వాటర్ ప్యాకెట్లు, మస్కిటోక్వాయిల్స్, బిస్కెట్లు, 800 టార్పాలిన్లు పంపిణీ చేశామన్నారు. మండలంలో ప్రస్తుతం ఎలాంటి ప్రాణనష్టం జరుగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌టీఆర్ఎఫ్‌కు, ఫైర్ డిపార్ట్‌మెంట్ బృందాలను అందుబాటులో ఉంచామన్నారు. విద్యుత్ సమస్య లేకుండా 12 జనరేటర్లను అందుబాటులో ఉంచామని తెలిపారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించి మూడవ ప్రమాద హెచ్చరికకు అనుగుణంగా సహాయ చర్యలు వేగవంతం చేసేందుకు, వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు 18 బోట్లు సిద్ధం చేశామన్నారు. అదే విధంగా పెద్దవాగు ప్రాజెక్టు నుంచి వరద నీరు ఆకస్మాత్తుగా ముంచెత్తడం వలన మండలంలోని మేడేపల్లి, రామవరం, తాట్కూరుగొమ్ము, రేపాకగొమ్ము, పంచాయతీల్లోని 12 గ్రామాలు ప్రభావితం అయ్యాయి. 968 కుటుంబాలు, 3517 మంది ప్రజలను పునరావాస కేంద్రాల్లో ఉంచామని తెలిపారు. వారికి అవసరమైన భోజనం, మంచినీరు, చంటి పిల్లలకు పాలు, వైద్య సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రభావిత కుటుంబాలకు 117 టార్పాలిన్లు కూడా పంపిణీ చేశామన్నారు.

సహాయక చర్యలు ముమ్మరం

గోదావరి వరద ముంపు వలన కుక్కునూరు మండలంలో 21 గ్రామాలు ప్రభావిత గ్రామాలుగా గుర్తించి సహాయ చర్యలు ముమ్మరం చేశామని ఆర్డీవో కె.అద్దయ్య తెలిపారు. గొమ్ముగూడెం, మాధవరం పంచాయతీల్లోని వరద ప్రభావిత కుటుంబాలకోసం మూడు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. దాచారం ఆర్అండ్ఆర్ కాలనీ పునరావాస కేంద్రంలో గొమ్ముగూడెం గ్రామంలో 250 కుటుంబాలు, లచ్చిగూడెంలో 140 కుటుంబాలను సమీపంలోని గుట్టపై ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలోకి, కొండిన్యముక్తి గ్రామం నుంచి 38 కుటుంబాలను, ఆర్అండ్ఆర్ కాలనీ మద్రిపాడులోని పునరావస కేంద్రానికి తరలించామన్నారు. ప్రస్తుతం దాచారం ఆర్అండ్ఆర్ కాలనీ, మద్రిపాడు ఆర్అండ్ఆర్ కాలనీల్లోని వరద బాధితులకు ఆహారం సరఫరా చేస్తున్నామన్నారు. ప్రస్తుతం మూడు ప్రభావిత గ్రామాలకు కూరగాయలు, పాలు, కొవ్వొత్తులు, వాటర్ ప్యాకెట్లు, బిస్కెట్లు, 150 టార్పాలిన్లు పంపిణీ చేశామని మరో 500 టార్పాలిన్లు అందుబాటులో ఉంచామన్నారు. వరద బాధిత గ్రామాలకు సంబంధించిన బాధితులకు రేషన్ సరుకులను అందించే నిమిత్తం మూడు నెలలకు సరిపడా నిల్వలు ఉంచామన్నారు. వరద ఉధృతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైతే వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు 12 బోట్లను సిద్ధం చేశామన్నారు.

జిల్లా జడ్జిని కలిసిన బార్ సభ్యులు



జిల్లా జడ్జి పురుషోత్తమ్ కుమార్‌కు మొక్కను అందిస్తున్న బార్ సభ్యులు

జంగారెడ్డిగూడెం: కోర్టుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని జిల్లా జడ్జి పురుషోత్తమ్ కుమార్‌ను జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ సభ్యులు కోరారు. మంగళవారం జిల్లా జడ్జి పురుషోత్తం కుమార్‌ను జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా బార్ సభ్యులు జంగారెడ్డిగూడెం కోర్టుకు ఏజీపీ, కోర్టు బిల్డింగ్స్, సబ్ కోర్టు తదితర అంశాలను జిల్లా జడ్జి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముళ్లపూడి శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు అచ్యుత శ్రీనివాస్, జీవీఆర్ శేఖర్, మాడా రామ్మోహనరావు, మాదేపల్లి క్రాంతి కుమార్, డీకేవీ ప్రసాద్, పిల్లి పెద్దిరాజు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతను ఆదుకోవాలి

జంగారెడ్డిగూడెం: తుఫాన్ వల్ల నష్టపోయిన రైతాంగానికి తక్షణమే ఎకరాకు రూ.15 వేలు నష్ట పరిహారం ఇచ్చి, అన్నదాతను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మండలంలోని పంగిడిగూడెం, నాగులగూడెం, పేరంపేట గ్రామాలలో ఎర్ర కాలువ నీరు విడుదల ద్వారా వచ్చిన వరదతో నీట మునిగిన పంగిడిగూడెం పొలాల్లో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అందుగుల ప్రభాకర్‌రావు, కమిటీ సభ్యుల బృందం పర్యటించారు. బాధిత రైతులతో పంట నష్టంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎం.జీవరత్నం మాట్లాడుతూ ఎర్ర కాలువ ప్రాజెక్టు వరద ప్రభావంతో వచ్చిన నీరు ఐదు రోజులు పొలాల్లో నిల్వ ఉండడంతో నాటిన వరి చేను కుళ్లిపోయి పంట నష్టం వాటిల్లిందని ఇప్పటి వరకూ ఎకరాకు అయిన ఖర్చు రూ.14 వేలని తెలిపారు. మరలా వరి పంట సాగు చేయాలంటే ఎకరాకు రూ.12 వేల వరకు ఖర్చవుతుందని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఎకరాకు పంట నష్ట పరిహారం కింద రూ.15 వేలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుదే బాలయ్య, కె.సుబ్బారావు, పి.చంటి, క్రోట నరసింహారావు, పాలా రామకృష్ణ, బి.హనుమంత్ పాల్గొన్నారు.

తమ్మిలేరు రిజర్వాయర్ పరిశీలన



తమ్మిలేరు రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ రవిచంద్ర

చింతలపూడి: చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం వద్ద తమ్మిలేరు రిజర్వాయర్‌ను జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ తమ్మిలేరు రిజర్వాయర్ ఫుల్ స్టోరేజ్ అయ్యి ఉన్నందున పర్యాటకుల పట్ల జాగ్రత్త వహించాలని, తమ్మిలేరు రీడింగ్ విషయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. రిజర్వాయర్ ఏఈ పరమానందాన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. తమ్మిలేరులోనికి మంగళవారం సాయంత్రం సమాచారం ప్రకారం కాచ్‌మెంట్ ఏరియాలో వర్షం, ఎగువ నుంచి వస్తున్న వరద కలిపి 787 క్యూసెక్కులు వస్తున్నట్లు ఏఈ తెలిపారు. రిజర్వాయర్ పూర్తి నీటి మట్టం 355 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం తమ్మిలేరు బేసిన్ 348.50 అడుగులు, గొనెల వాగు బేసిన్ 348.21 అడుగులు ఉందని తెలిపారు. పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 3 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి నిల్వ 1.870 టీఎంసీలుగా ఉందని ఏఈ తెలిపారు. కార్యక్రమంలో చింతలపూడి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుధాకర్, చింతలపూడి ఎస్సై కుటుంబరావు, జంగారెడ్డిగూడెం ఏఎస్ఐ సోంబాబు, చక్రి, రిజర్వాయర్ సూపర్‌వైజర్ రామకష్ణ, తదితరులు పాల్గొన్నారు.

తిలక్, ఆజాద్ ఆదర్శనీయులు



తిలక్, ఆజాద్ చిత్ర పటాలకు పూలమాలు వేసి నివాళులర్పిస్తున్న కళాశాల అధ్యాపకులు

కామవరపుకోట: ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధులు బాల గంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్‌లను ఆదర్శంగా తీసుకోవాలని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు అన్నారు. మంగళవారం తిలక్, ఆజాద్ జయంతి సందర్భంగా ఎన్ఎస్ఎస్, రాజనీతి శాస్త్ర విభాగం సంయుక్త ఆధ్వర్యంలో తిలక్, ఆజాద్‌ల చిత్ర పటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ మల్లేశ్వరరావు మాట్లాడుతూ తిలక్, ఆజాద్ మన దేశ స్వాతంత్రం కోసం ఎంతో ధైర్యంగా బ్రిటీష్ వారితో పోరాడిన గొప్ప ఉద్యమకారులని, వారిరువురూ దేశ స్వాతంత్ర్యం కోసం చేసిన త్యాగం ఎనలేనిదని, తిలక్, ఆజాద్‌లను స్ఫూర్తిగా తీసుకొని ప్రతీ ఒక్కరు దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విభాగం కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.శ్రీనివాసరావు, అధ్యాపకులు కె.ఇందిరా కుమారి, ఎం.ఉషారాణి, ధారావతు మల్లేష్, సిబ్బంది పాల్గొన్నారు.

గోదావరి వరద తగ్గుముఖం



ఇంటిపై కూలిన చెట్టు

కుక్కునూరు: తుఫాన్ ప్రభావంతో గోదావరి నదీ పరివాహక ప్రాంతాలలో కురిసిన వర్షాల కారణంగా పెరిగిన వరద తగ్గుముఖం పట్టింది. భద్రాచలం వద్ద సోమవారం ఉదయానికి 51 అడుగులకు చేరింది. కాగా పెరిగిన వరదతో మండలం నుంచి భద్రాచలం మధ్య ఆర్అండ్‌బీ రోడ్ నీట మునిగడంతో రాకపోకలు స్తంభించాయి.అంతేకాక పెరిగిన వరద కుక్కునూరు గ్రామ శివారులోని దాచారం రోడ్డు పైకి చేరింది. కాగా వరద తీవ్రత మూడవ ప్రమాద హెచ్చరికకు చేరువలోకి రావడంతో మండలంలోని ప్రజలు ఆందోళన చెందారు. ముందస్తు జాగ్రత్తగా అధికారులు ముంపు గ్రామాల ప్రజలను ఇప్పటికే పునరావాస కేంద్రాలకు తరలించారు. తుఫాన్ ప్రభావంతో గత మూడురోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలో సరిత అనే మహిళ పూరిల్లుపై చెట్టు కూలింది. సోమవారం ఉదయం నుంచి గోదావరి వరద తీవ్రత తగ్గుముఖం పట్టడంతో మండల వాసులు ఊపిరి పీల్చుకున్నారు.

డ్వామా పీడీ గ్రామాల పరిశీలన



మెడికల్‌క్యాంప్‌ను పరిశీలిస్తున్న డ్వామా పీడీ రాము

కుక్కునూరు: గోదావరి వరద నేపథ్యంలో వరద ప్రభావిత బాధితులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని డ్వామా పీడీ, మండల ప్రత్యేక అధికారి ఎ.రాము చెప్పారు. సోమవారం మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాలను ఆయన ఎంపీడీవో నరసింహరావు, తహసీల్దార్ పి.అచ్యుతాకుమారిలతో కలిసి కుక్కునూరు ఎ బ్లాక్, దాచారం పంచాయతీ బెస్తగూడెం, ఆంబోతుల గూడెం, అమరవరం, చెరువుగొమ్ముగూడెం, ఎలకలగూడెం, కోమట్లగూడెం, ముత్యాలంపాడు, కివ్వాక, మద్రిపాడు ఆర్అండ్ఆర్ కాలనీలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి, డ్వామా పీడీ ఎ.రాము మాట్లాడుతూ గోదావరి వరద మూడవ హెచ్చరిక సమయంలో మండలంలోని 10 నివాసిత ప్రాంతాలపై ప్రభావం ఉంటుందన్నారు. గ్రామస్తులను పునరావాస కేంద్రానికి వచ్చేలా అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో పర్యటించామన్నారు. గోదావరి వరద హెచ్చరికలకు అనుగుణంగా ఆయా నివాసిత ప్రాంతాల్లో పునరావాస, సహాయక చర్యలు చేపట్టేలా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ప్రత్యేక అధికారులను నియమించడం మంచి ఫలితాన్ని ఇచ్చిందన్నారు. దాచారం ఆర్అండ్ఆర్ పునరావాస కేంద్రంలో 10 బయోటాయిలెట్లను ఏర్పాటు చేశామన్నారు. కాలనీల్లో 60 నుంచి 70 వరకు వీధి దీపాలను వేశామన్నారు. అదే విధంగా జిల్లా యంత్రాంగం మంచినీటి సమస్యపై ముందుచూపుతో చేసిన కార్యక్రమాల వలన నీటి సమస్య తలెత్తలేదన్నారు.

పంట నష్ట పరిహారం చెల్లించాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

కామవరపుకోట: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ముంపునకు గురై పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20 వేలు నష్ట పరిహారం చెల్లించాలని సీపీఐ మండల కార్యదర్శి టీవీఎస్ రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలో ముంపు ప్రాంత భూములను సీపీఐ ప్రతినిధి బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు ఏడాది పొడవునా కష్టించి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నాడన్నారు. ఎరువులు, మందులు, పనిముట్లు అధిక ధరలకు కొనుగోలు చేసి పంటలు నాటితే, తుఫాను ప్రభావంతో వరి నాట్లు, వాణిజ్య పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాల్సిన నైతిక బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రుణ విమోచన చట్టం చేసి, వాణిజ్య బ్యాంకులు, సహకార సంఘాల్లో రైతులపంట రుణాలను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు దుర్గారావు, రాంబాబు, రాఘవులు కానూరు వీరభద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు తక్షణ సాయం

జంగారెడ్డిగూడెం: వరద బాధిత గర్భిణులకు తక్షణ సాయమందించాలని విశ్రాంత బీఎస్ఎన్ఎల్ అధికారి, సంఘ సేవకుడు బోడా సత్యనారాయణ అన్నారు. స్థానిక అల్లూరి సీతారామరాజు మున్సిపల్ పార్క్ ఆరోగ్యాభిలాషులు మంగళవారం స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 19 మంది వరద బాధిత గర్భిణులకు ఉపశమనంగా దుప్పట్లు, మప్లర్లు, రొట్టెలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. 10 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు ముంపునకు గురయ్యాయి. వరద ముంపు ప్రాంతాల నుంచి కలెక్టర్ వెట్రి సెల్వి ఆదేశాల మేరకు 19 మంది గర్భిణులను ఏరియా ఆసుపత్రిలో చేర్చారు. కార్యక్రమంలో అల్లూరి రామరాజు, చింతా రామిరెడ్డి, యాన్నమనేని రామకృష్ణ, మర్నేని జనార్ధనరావు, శైలజ రెడ్డి, పుష్ప, యోగా గురువు దిలీప్, ఆనంద్, హేమ, అంజలి, ప్రియ, దాసరి శేషు కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఉపాధ్యాయుల సహాయం

వేలేరుపాడు: మండలంలో గతంలో పని చేసిన ఉపాధ్యాయులు ఆనాటి ఎంఈవో జగన్ మోహన్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం వరద బాధితులకు సహాయం అందజేశారు. అల్పపీడనంతో కురిసిన వర్షాలకు పెదవాగు ప్రాజెక్టు వరదకు నిరాశ్రయులైన కమ్మరిగూడెంలో సుమారు 250 కుటుంబాలకు బియ్యం, కూరగాయలు, సరుకులు అందించారు. ఎంఈవో మాట్లాడుతూ ఈ గ్రామం పూర్తిగా వరదల వలన చిన్నాభిన్నమైందని, వరద బాధితులకు సహాయం చేయటం తమ బాధ్యతగా భావించి గతంలో పనిచేసిన ఉపాధ్యాయులతో కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ ఉపాధ్యాయులు ప్రస్తుతం తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో పని చేస్తున్నారు.

ప్రైవేట్ విద్యా సంస్థల ఫీజులు బహిర్గతం చేయాలి

జంగారెడ్డిగూడెం: ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజులు బహిర్గతం చేయాలని డీవైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యా సంస్థల నిబంధనల సమాచారం కోరుతూ ఎంఈవో బి.రాముడికి మంగళవారం డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూర్య కిరణ్ వినతిపత్రం సమర్పించారు అనంతరం సూర్యకిరణ్ మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం పట్టణంలో గల ప్రైవేట్ విద్యా సంస్థలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని, కనీసం భోజన వసతులు డైనింగ్ హాల్స్ లేని విద్య సంస్థలు ఉన్నాయన్నారు. విద్యాసంస్థల్లో ఫీజుల రీయింబర్స్‌మెంట్ బహిర్గతం చేయకపోవడంతో అదనంగా చెల్లిస్తున్నామని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. జిల్లా కమిటీ సభ్యులు ఎం.వెంకట్రాజు, ఎస్.రాజేష్ పాల్గొన్నారు.

ముంపులో పొలాలు

పోలవరం రూరల్: వరద పెరుగుతుండటంతో పోలవరం ప్రాంతంలో పొలాలన్నీ వరద ఎగపోటు నీటితో చెరువులను తలపిస్తున్నాయి. వరద పెరుగుతున్న కొద్దీ పొలాల ముంపు మరింత పెరుగుతోంది. ఒక వైపు కొండ కాలువల నీరు, మరో వైపు గోదావరి ఎగపోటుతో వరినాట్లు వేసిన పొలాలు, వరినాట్ల పొలాలు ముంపునకు గురయ్యాయి. వరద పూర్తిగా తగ్గితే తప్ప ఈ నీరంతా కడెమ్మ స్లూయిజ్ ద్వారా గోదావరిలోకి చేరే పరిస్థితి లేదు.

ప్రాజెక్టుకు వెళ్లే రోడ్డు మార్గం మునక

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతానికి వెళ్లే రోడ్డు మార్గంలో వరద నీరు ప్రవహిస్తోంది. వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. వరద మరింత పెరిగితే ఈ రోడ్డు మార్గం మొత్తం వరద నీటితో మూసుకుపోతుంది. ప్రాజెక్టు అధికారులు, ఏజెన్సీ సిబ్బంది ఈ రోడ్డు మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు మార్గం ముంపునకు గురైతే ప్రాజెక్టుకు వెళ్లడానికి ఇబ్బందులు ఎదురవుతాయి.

తిలక్‌కు ఘన నివాళి

కొయ్యలగూడెం: స్వరాజ్యం నా జన్మ హక్కు అని చాటిన మహనీయుడు బాలగంగాధర్ తిలక్ అని కుంతలగూడెం ప్రధానోపాధ్యాయుడు రాయపూడి రమణ పేర్కొన్నారు. మంగళవారం గ్రామంలోని ఎంపీపీ స్కూల్‌లో తిలక్ మహాశయుని 168వ జయంతి వేడుకలు నిర్వహించారు. దేశంలో గణేష్ ఉత్సవాలను మొట్టమొదటి సారిగా మహారాష్ట్రలో నిర్వహించి దేశ ఐక్యతను చాటి చెప్పారని తద్వారా అది స్వాతంత్రోద్యమానికి కారణమయ్యిందన్నారు. తిలక్ చిత్రపటానికి పూల మాలలు వేసి చిన్నారులు నివాళులర్పించారు.

హామీల అమలుకు ఎన్‌డీఏ కృషి

జంగారెడ్డిగూడెం: ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పేర్కొన్న హామీలను నెరవేర్చడానికి ఎన్డీయే సర్కారు కృషి చేస్తోందని జంగారెడ్డిగూడెం పట్టణ బీజేపీ అధ్యక్షులు కొప్పాక శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజధాని నిర్మాణానికి ప్రత్యేక ఆర్థిక సహకారం రూపంలో రూ.15 వేల కోట్లు కేటాయించడం సంతోషంగా ఉందన్నారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయిస్తామని చెప్పారని వివరించారు.

ఎంపీడీవో మృతికి నివాళి



ఎంపీడీవో రమణకు నివాళి అర్పిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: నరసాపురం మండల పరిషత్ అభివృద్ధి అధికారి వెంకట రమణరావు మృతిపై జంగారెడ్డిగూడెం ఎంపీడీవో సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెంకట రమణరావు చిత్రపటానికి ఎంపీడీవో కె.విజయ ప్రసాద్, సిబ్బంది పూల మాలలు వేసి నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. వెంకట రమణరావు మృతి చాలా బాధాకరమని ఎంపీడీవో విజయ్ ప్రసాద్ అన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం



దాత శ్రీనివాసరావు దంపతులకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఏఈవో దుర్గారావు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు మంగళవారం ఒక భక్తుడు రూ.50,516 లను విరాళంగా అందజేశారు. విజయవాడకు చెందిన పోలవరపు శ్రీనివాసరావు, సరిత దంపతులు ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాత దంపతులకు ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

విద్యార్థి అనుమానాస్పద మృతి

వేలేరుపాడు: వేలేరుపాడు మండల కేంద్రానికి చెందిన విద్యార్థి సరిపల్లి అభినయ్‌కుమార్ (17) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఇందుకు సంబంధించి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వేలేరుపాడుకు చెందిన అభినయ్‌ను ఇదే గ్రామానికి చెందిన మేకల మురళి, పత్రా ముత్యాలు అను వారు ఈ నెల 20న తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రికి తీసుకెళ్లారని, 23న జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రి మార్చరీలో శవమై కన్పించాడని తెలిపారు. తమ కుమారుడి మృతిపై అనుమానాలున్నాయని, విచారించి తమకు న్యాయం చేయాలని తండ్రి సరిపల్లి వెంకటేశ్వర్లు మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వేలేరుపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అభినయ్‌కుమార్ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కుక్కునూరు సీఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ

ఏలూరు రూరల్ : స్థానిక వైఎస్సార్ కాలనీ మండల పరిషత్ పాఠశాలలో మంగళవారం నోట్ బుక్స్ పంపిణీ జరిగింది. ప్రధానోపాధ్యాయురాలు పి.జయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించి న కార్యక్రమంలో ఏలూరు స్మార్ట్‌సిటీ లయన్స్ క్లబ్ జెడ్‌సీ దిడ్ల యాంజిలో, ట్రస్ స్వచ్ఛంద డైరెక్టర్ దిడ్ల స్వర్ణకుమారి, యూటీఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు షేక్ ముస్తఫా ఆలీ చేతుల మీదుగా బాలబాలికలకు ఉచితంగా నోట్స్ బుక్స్ అందజేశారు. ఉపాధ్యాయులు పి.లక్ష్మి, సూర్యకుమారి, జీజేఏ స్టీవెన్ పాల్గొన్నారు.